www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
5
ఏలూరు



2న ట్రెజరీస్, అకౌంట్స్ సంఘ ఎన్నికలు

రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కృష్ణంరాజు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా ట్రెజరీ ఏలూరు ప్రాంగణంలో వచ్చే నెల రెండో తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కృష్ణంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, సహాయ ఎన్నికల అధికారిగా షేక్. ఫయాజ్ అహ్మద్, ఎన్నికల పరిశీలకురాలిగా జె. కరుణ వ్యవహరిస్తారని తెలిపారు. కావున ఏలూరు జిల్లాలోని యావన్మంది ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్టుమెంటుకు సంబంధించిన ఉద్యోగులు ఈ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరారు.

హోరా హోరీ..!

టిడిపి, పిడిఎఫ్ మధ్య నువ్వానేనా అన్నట్లు ఎంఎల్‌సి ఎన్నికల ఫైట్

తూర్పు, పశ్చిమలో మొత్తం 63.28 శాతం పోలింగ్ నమోదు

ఉదయం నుంచి మందకొడిగా సాగిన ఓటింగ్ ప్రక్రియ

మధ్యాహ్నం నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద అధికార పార్టీ నేతల ఇష్టారాజ్యం

యలమంచిలి పోలింగ్ కేంద్రంలోకి మంత్రి రామానాయుడు, అనుచరులు

ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేస్తూ నిల్చొని మంత్రికి సలాం కొట్టిన సిబ్బంది

పెదవేగి పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు, అడ్డు చెప్పిన పిడిఎఫ్ నాయకులపై టిడిపి నేతల దాడి

పాలకొల్లులో ఓటుకు రూ.వెయ్యి పంపిణీపై తీవ్ర చర్చ, శిబిరాల పేరుతో హల్‌చల్



ఏలూరు అర్బన్ : సెయింట్ జేవియర్ స్కూలులో పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. గురువారం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో 63.28 శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 3,14,984 మంది ఉండగా సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 1,99,325 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు జిల్లాల్లో మొత్తం 456 కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవ్వగా మొదటి నుంచి మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 5.77 శాతం మాత్రమే పోలింగ్ జరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 12 గంటలకు 26.04 శాతం, రెండు గంటలకు 45.29 శాతం, సాయంత్రం నాలుగు గంటలకు 63.28 శాతం పోలింగ్ నమోదైంది. రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య ఓటింగ్ కొంత ఎక్కువగా సాగింది. 35 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో బ్యాలెట్ పెద్దగా ఉండటంతో ఎన్నికల అధికారులు చెప్పిన విధంగా మడత పెట్టి బ్యాలెట్ బాక్సులో వేసేందుకు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. సచివాలయ ఉద్యోగులంతా కొత్తగా ఓటు నమోదు చేసుకోవడంతో ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు ఎన్నికల పోరు సాగింది. పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూలంగా ఓటింగ్ జరుగుతుందని ప్రచారం సాగడంతో మధ్యాహ్నం నుంచి కూటమి నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లిపోవడం, అడ్డు చెప్పిన పిడిఎఫ్ నాయకులపై దాడికి దిగడం వంటి ప్రక్రియ సాగింది. అధికార పార్టీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నప్పటికీ పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు.

ఎన్నికల నిబంధనలు తూచ్.. అధికార పార్టీ నేతలకు అధికారుల సలాం..

ఎన్నికల నిబంధనలను అధికారులు పూర్తిగా తుంగలో తొక్కిన పరిస్థితి ఉంది. మంత్రి నిమ్మల రామానాయుడు యలమంచిలి మండల కేంద్రంలోని 432 పోలింగ్ కేంద్రంలోకి పదుల సంఖ్యలో తన అనుచరులతో వెళ్లినా పోలీసులుగాని, ఎన్నికల అధికారులుగాని అడ్డు చెప్పలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారులు ప్రధానమంత్రి వచ్చినా లేచి నమస్కారాలు చేయకూడదు. మంత్రి నిమ్మల రామానాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే అక్కడ ఎన్నికల ప్రక్రియ నిర్వహించే అధికారులు అంతా లేచి నిలబడి ఆయనకు సలాం చేసిన తీరు అందరినీ నివ్వెరపర్చింది. పాలకొల్లులో పట్టభద్రుల ఓటర్లకు ఓటుకు రూ.వెయ్యి పంపిణీపై పెద్దఎత్తున దుమారం రేగింది. పెదవేగిలోని 324, 325, 326, 327 పోలింగ్ కేంద్రాల్లో కూటమి నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై నిలదీసిన పిడిఎఫ్ శ్రేణులు, ఏజెంట్లు జి.శివకుమార్, పి.రామకృష్ణపై కూటమి నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, వారి అనుచరులు దాడికి పాల్పడటం గమనార్హం. ఆ సమయంలో తహశీల్దార్, ఎస్ఐ అక్కడే ఉన్నప్పటికీ పట్టించుకోని పరిస్థితి కన్పించింది. సదరు అధికారులు కూటమి నేతలకు సలాం కొట్టిన పరిస్థితి ఉంది. పోలింగ్ కేంద్రాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి పెద్దఎత్తున హడావుడి చేయడమే కాకుండా భోజనాలు పెట్టడం, ఓటర్లను ఓటు వేయాలని బెదిరించడం, డబ్బులు పంపిణీ చేయడం విచ్చలవిడిగా సాగింది. కూటమి నేతల దౌర్జన్యాలపై ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోని పరిస్థితి ఉంది.

ఓటింగ్ ప్రక్రియ ఇలా..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1.అల్లూరిసీతారామరాజు	12	4,669	3,637	79.90
2.అంబేద్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
3.తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4.ఏలూరు	66	42,282	29,651	70.13
5.కాకినాడ	98	70,540	47,150	66.84
6.పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
మొత్తం	456	3,14,984	2,18,902	69.50

ప్రజాగొంతుక విజయం సాధించాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో నా ఓటు హక్కు వినియోగించుకున్నా. కచ్చితంగా పట్టభద్రులు, నిరుద్యోగుల తరపున వారి ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు తీర్చే ప్రజా గొంతుకగా నిలిచే అభ్యర్థి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. రాబోయే రోజుల్లో శాసనమండలిలో పట్టభద్రుల నుండి ఎన్నికైన అభ్యర్థి పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమస్యలపై పోరాటం చేసేలా ఉండాలి.

సేవాగుణం గల వ్యక్తిని ఎన్నుకోవాలి

భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయ మంత్రి

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా పట్టభద్రులు వ్యవ హరించాలి. ఓటు వేయడం బాధ్యతగా నాగాలాండ్ నుండి వచ్చి ఓటు హక్కు వినియోగించు కున్నాను. పట్టభద్రులు సేవాగుణం గల వ్యక్తిని ఎన్నుకోవాలి.

మేధావుల స్థానాల్లో రాజకీయం బాధాకరం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

రాజకీయ పార్టీలు అధికారం దక్కాక ప్రజల కోసం మాట్లాడరు. ప్రజలకు వ్యతిరేకంగా తీర్మానాలు, చట్టాలు చేస్తారని ఆనాడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆలోచించి ఉపాధ్యాయులకు, గ్రాడ్యుయేట్లకు పది ఎంఎల్‌సి స్థానాల్లో పోటీ చేసేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. కొంతమంది మేధావులు శాసనమండలిలో ఉంటే వాళ్లు ప్రజల వైపు ఆలోచన చేస్తారని స్థానాలను కేటాయిస్తే వాటిలో రాజకీయం పులుముకోవడం అత్యంత బాధాకరం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఈ స్థానాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతుంది. 2007 నుంచి కొంతమంది మేధావులు, టీచర్లు, విద్యావంతులను పిడిఎఫ్ పోటీకి నిలిపింది. 14 మంది 26 సార్లు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచారు. గెలిచిన తర్వాత ఇటు పాలకపక్షం, అటు ప్రతిపక్షానికి ఒరిగిపోకుండా ప్రజలపక్షాన నిలబడింది పిడిఎఫ్ ఎంఎల్‌సిలే. అటువంటి పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్న దిడ్ల వీర రాఘవులు ఉపాధ్యాయునిగా పని చేసి అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. రెండు జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల నుంచి పిడిఎఫ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. పోలింగ్ సరళిని చూస్తుంటే మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే దిడ్ల వీరరాఘవులు గెలుస్తారని తెలుస్తోంది.

ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం..

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు బలమైన ఆయుధమని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నిక సందర్భంగా గురు వారం స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఐవి విలేకరులతో మాట్లాడుతూ హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా సమస్యలపై పిడిఎఫ్ నిర్వహించిన ప్రచారం అమితంగా ఆకట్టుకుందన్నారు. గతంలో పిడిఎఫ్ నెరవేర్చిన పోరాటాల వారసత్వం అభ్యర్థులకు బాగా కలిసొచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.మోహన్‌రావు, ఎస్‌విఎన్.శర్మ, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, పిల్లి చంటిబాబు, కొండేటి సత్యనారాయణ, కుసుమ జయరాజు, దేవబత్తుల రాధాకృష్ణ, మన్నె బ్రహ్మయ్య, బొర్రా ధర్మారావు, బొర్రా చైతన్య, ఉన్నమట్ల ప్రసాద్, కరిణి బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు



ఓటేస్తున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి



పోలింగ్ సరళి పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నిధులిస్తారా.. హ్యాండిస్తారా..

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తారా

చింతలపూడి, తాడిపూడికి నిధులు కేటాయించేనా

డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులు ఉండేనా

ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా

కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిచ్చేనా

నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ కార్యరూపం దాల్చేనా

నేడు అసెంబ్లీలో 2015-26 బడ్జెట్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. మళ్లీ చెయ్యిస్తారా అనే చర్చ సాగుతోంది. అఖండ మెజార్టీతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్ 11న పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు అరకొరగా సాగగా, కేటాయించిన నిధులు సైతం ఖర్చుపెట్టని పరిస్థితి ఉంది. దీంతో అన్ని స్థానాల్లో గెలిపించిన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఏమాత్రం న్యాయం జరగని పరిస్థితి ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులిస్తారా అనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య ప్రధానమైంది. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 107 గ్రామాలకు సంబంధించి 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. సర్వంకోల్పోతున్న నిర్వాసితులకు గత వైసిపి ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ కింద కుటుంబానికి రూ.పది లక్షలు ఇస్తామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని చెప్పింది. ఐదేళ్లలో వైసిపి చిల్లిగవ్వ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని నిర్వాసితులకు రూ.250 కోట్లు వరకూ విడుదల చేసినప్పటికీ 2014లో ప్రకటించిన రూ.6.25 లక్షల ప్యాకేజీ మాత్రమే ఇచ్చింది. రూ.పది లక్షల ప్యాకేజీ ఇవ్వలేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. భూములకు పరిహారం గురించి మాట్లాడటం లేదు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం విషయంలో 2017 కటాఫ్ తేదీగా నిర్ణయించడాన్ని నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహించాలంటూ ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ప్రతిపాదించారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం అందకపోవడంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న వరదలకు నిర్వాసితులు నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేంద్రం నుంచి నిధులు తెచ్చి నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సి ఉంది. పోలవరానికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు ఏవిధంగా కేటాయిస్తారో వేచిచూడాలి.

చింతలపూడి, తాడిపూడికి నిధులిచ్చేనా..?

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాడిపూడి ప్రాజెక్టుకు పిల్ల కాల్వలు పూర్తి చేస్తే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. దశాబ్దాలు గడిచినా ఈ సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చింతలపూడికి రూ.150 కోట్లు కేటాయించినట్లు చూపించినా ఖర్చు పెట్టలేదు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు రూ.3,782 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అంచనా వేసింది. 2026 జూన్‌కు తొలిదశ పనులు పూర్తి చేస్తామని చెప్పింది. ఈ ప్రకారం ఈ బడ్జెట్‌లో తక్కువగా లెక్కించినా రూ.1500 కోట్లకుపైగా కేటాయించాల్సి ఉంది. నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి. తాడిపూడికి నిధులు కేటాయించి పిల్ల కాలువలు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు 2006లో ప్రారంభమైంది. మరో రూ.200 కోట్లు కేటాయిస్తే పనులు చాలావరకూ పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉప కాలువలు ఉన్నాయి. 2007లో అప్పటి ప్రభుత్వం రూ.1,416 కోట్లు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేసింది. దాదాపు రూ.800 కోట్లు వరకూ పనులు జరిగాయి. పెరిగిన ధరలతో ఉన్న పనులు చేయాలంటే మరో రూ.వెయ్యి కోట్లు వరకూ ఖర్చు చేస్తే తప్ప డెల్టా ఆధునికీకరణ పూర్తయ్యే పరిస్థితి లేకుండాపోయింది. గత బడ్జెట్‌లో డెల్టా ఆధునికీకరణకు రూ.25 కోట్లు కేటాయించినట్లు చూపినా ఖర్చు చేయలేదు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఆధునికీకరణను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించి డెల్టా ఆధునికీకరణ పూర్తి చేస్తుందో, లేదో చూడాలి.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిస్తారా?

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని 2014-19లో టిడిపి ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఫిషింగ్ హార్బర్ పనుల్లో కదలిక ఉంటుందో, లేదో అనే చర్చ సాగుతోంది. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని జనం కోరుతున్నారు.

రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా..?

జిల్లాలో అతి పెద్ద సాగుగా వరి ఉండగా, మరో రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. రొయ్యకు సరైన ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. మేత ధరలు పెరిగిపోయి పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది. దీంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. వరి రైతులకు సైతం బోనస్ వంటి ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. బడ్జెట్‌లో వరి, ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు అందించేలా ఏమైనా నిధులిస్తారా వేచిచూడాలి.

బలివే ఉత్సవాల్లో అపశృతి

తమ్మిలేరులో స్నానానికి దిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

బలివే ఉత్సవాల్లో మూడోరోజు గురువారం అపశృతి చోటు చేసుకుంది. తమ్మిలేరులో స్నానం చేసేందుకు దిగిన వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన హెచ్.రాంబాబు (28) అదే గ్రామానికి చెందిన మరికొంతమందితో కలిసి గురువారం బలివే వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు తమ్మిలేరులో దిగగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. దీంతో అతనితో పాటు వచ్చినవారు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు అరగంట తర్వాత అతని మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. రాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాంబాబు వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. రాంబాబు మృతితో అక్కిరెడ్డిగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



రాంబాబు (ఫైల్‌ఫొటో)

నాడు దర్జా... నేడు దుర్భరం..!

దర్జీల బతుకు భారం

చేతి వృత్తులను పాలకులు ఆదుకోవాలి

500 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలి

నేడు టైలర్స్ డే

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

దశాబ్దాల తరబడి వంశ పారంపర్యంగా కొనసాగుతున్న దర్జీల జీవనం ఎదుగు బదుగు లేక భారంగా జీవితాన్ని గడుపుతున్నారు. దర్జీ పనిపై ఆధారపడిన అనేకమంది అరకొర ఆదాయంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. నేటి ఆధునిక యుగంలో టైలర్స్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ నెల 28వ తేదీ టైలర్స్ డేను పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

పండుగలు, పెళ్లిళ్లకు కూడా చేతినిండా పని దొరకని దుర్భర రోజులు

సుమారు 20 ఏళ్ల క్రితం ప్రతి ఏడాది వచ్చే పండుగలు, పెళ్లిళ్ల సమయంలో మాత్రమే టైలర్స్‌కు చేతినిండా పని దొరికే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పండుగలు, పెళ్లిళ్లకు కూడా చేతినిండా పని దొరకని దుస్థితి నెలకొంది. వంశపారంపర్యంగా చేతివృత్తులతో పాటు ఇతరులు కూడా టైలరింగ్ నేర్చుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ వ్యాపారుల మధ్య కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. టైలరింగ్ వచ్చినవారు గ్రామాల నుంచి నగరాలకు చేరుకుని ఇక్కడ ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద షాపుల్లో కార్మికులుగా పనిచేస్తూ ఉపాధిని పొందుతున్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో దాదాపు వెయ్యికి పైగా టైలరింగ్ షాపులు ఉన్నాయి. అడుగడుగునా ఈ మోడ్రన్ ప్రపంచంలో రెడీమేడ్ దుస్తుల దుకాణాలు కూడా నేటి ఫ్యాషన్ ప్రపంచానికి అనుగుణంగా వెలిశాయి.



రెడీమేడ్ దుస్తుల వ్యాపారంతో విలవిలలాడుతున్న టైలర్స్


రోజురోజుకు రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేసే వారి సంఖ్య పెరుగుతుంది. నేటి యువత కూడా రెడీమేడ్ దుస్తులను ఎక్కువగా కొనడానికి ఇష్టపడుతున్నారు. చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు రెడీమేడ్ దుస్తుల వైపే మొగ్గు చూపుతున్నారు. రెడీమేడ్ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందడంతో టైలర్ దుకాణాలకు వెళ్లి దుస్తులను కుట్టించుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. రంగులతో పాటు ఆకట్టుకునే డిజైన్లతో కూడిన వస్త్రాలు లభించడంతో ధర ఎక్కువైనా రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేయడానికి ఇష్టపడుతూ ఉండటంతో టైలర్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు

దర్జీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తూ వారి సంక్షేమ పరంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కూడా సత్వర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేతి వృత్తులను ప్రోత్సహించే విధంగా దర్జీలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెడీమేడ్ దుస్తుల వల్ల టైలర్స్ దుకాణానికి వచ్చి దుస్తులు కుట్టించుకోని పరిస్థితి నెలకొన్న ప్రభుత్వం తమను పట్టించుకోకపోవటంతో పలువురు టైలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేదోడు పథకం ద్వారా టైలర్ దుకాణం ఉన్న ప్రతి టైలర్‌కు సంవత్సరానికి రూ.పది వేలు అందించింది. కాని ఇప్పుడు ఉన్న ప్రభుత్వం తమకు ఎటువంటి సంక్షేమ పథకం అమలు చేయలేదని టైలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టైలరింగ్ దుకాణాలకు 500 యూనిట్లు కరెంటు సబ్సిడీ ఇవ్వాలి

నూజివీడు టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి రఫీ



ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దర్జీల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. కరెంటు బిల్లులను కూడా చెల్లించలేని ఆర్థిక దుస్థితి మాది. 500 యూనిట్లు కరెంటు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే దర్జీలకు బ్యాంకుల నుంచి రుణాలను అందించి ఉపాధి కల్పించాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. రేషన్ కార్డు, ఆసరా పింఛన్లతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలి. ప్రజల ఆలోచనల్లో కూడా మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి. భవన నిర్మాణ కార్మికులకు, ప్రయివేట్ ఎలక్ట్రిషియన్లకు ఇచ్చినట్లుగా లేబర్ యాక్ట్ ద్వారా వారికున్న సదుపాయాలు టైలర్స్ అందరికీ కలగజేయాలని చేతి వృత్తులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

చెరువులో గల్లంతైన బాబాయ్, అబ్బాయ్ మృతి

ఏలూరు స్పోర్ట్స్: చెరువులో ఊబిలో ఇరుక్కున్న బాబాయ్‌ని కాపాడబోయి అతనితో పాటు కుమారుడు కూడా గల్లంతైన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. నగరంలోని మూడో పట్టణ పరిధి వట్లూరు గ్రామానికి చెందిన బజ్జవరపు వెంకటేశ్వరరావు (55) బుధవారం సాయంత్రం స్నానం చేసేందుకు స్థానికంగా ఉన్న చెరువులో దిగాడు. స్నానానికి దిగిన వెంకటేశ్వర రావు చెరువులో ఉన్న ఊబిలో ఇరుక్కుపోవడం గమనించిన అతని అన్నయ కుమారుడు సుబ్రహ్మణ్యం (30) వెంకటేశ్వరరావును కాపాడేందుకు చెరువులో దిగాడు. వెంకటేశ్వరరావుతో పాటు సుబ్రహ్మణ్యం కూడా ఊబిలో ఇరుక్కుని ఇద్దరు చెరువులో గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది బుధవారం రాత్రి వరకు గాలించినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలుపుదల చేసి గురువారం ఉదయం మళ్లీ చేపట్టారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొని గాలించగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకే కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. పండుగ వేళ ఇద్దరు వ్యక్తుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడిఎఫ్ ఏజెంట్లపై, కార్యకర్తలపై దాడి దారుణం

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ ఏజెంట్లపై, కార్యకర్తలపై పెదవేగిలో జరిగిన దాడిని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెదవేగి మండలంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల 324, 325, 326, 327 పోలింగ్ బూత్‌లలో కూటమి అభ్యర్థులు దొంగ ఓట్లు భారీగా వేయించారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను అడ్డుకున్న పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లు, కార్యకర్తలపై కూటమి నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, వారి అనుచరులు దాడిచేసి కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికార పక్ష కార్యకర్తలు దొంగ ఓట్లు వేసిన విషయాన్ని ఎలక్షన్ పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయడాన్ని, వ్యతిరేకించడాన్ని ఓర్వలేక 326 పోలింగ్ బూత్‌లో గేదెల శివకుమార్, పిల్లి రామకృష్ణలపై దాడి చేసి కొట్టాడం దారుణమని తెలిపారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళలపై దాడి చేయడంతో పాటు మహిళల వద్ద ఉన్న సెల్‌ఫోన్ పగలకొట్టి విలువైన వస్తువులను పాడు చేసినట్లు తెలిపారు. మహిళలపై కూడా పరుష పదజాలంతో దూషించటం, దాడి చేయడం అప్రజాస్వామ్యకమని పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని, నిందితులపై తగుచర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలకు పాతర

ఓటర్లను ప్రలోభపెట్టిన కూటమి నేతలు

కార్మిక, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - మండవల్లి

కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి కూటమి శిబిరాల పేర్లతో జాతర నిర్వహించి ఎన్నికల నిబంధనలకు పాతరేసి డబ్బులు పంపిణీ చేయడంతో పాటు అక్రమాలకు పాల్పడ్డారని పలువురు కార్మిక ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. ఎంఎల్‌సి ఎన్నిక అనంతరం నిర్వహించిన ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో కూటమి కేంద్రాల వద్ద ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేశారని విమర్శించారు. ఎన్నికల పేరుతో శిబిరాలను ఏర్పాటు చేసి జాతరలు నిర్వహించారని పోలీస్ యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించిందని విమర్శించారు. అక్రమాలకు పాల్పడి ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి గెలవాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ చేసిన అక్రమాలపై ఎన్నికల సంఘం స్పందించాలని ఆయన కోరారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కెఎస్.లక్ష్మణరావుకు ఓటు వేసిన గ్రాడ్యుయేట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా జిల్లాలో టిడిపి కూటమి అభ్యర్థి ఎన్నికల నిబంధనలకు పాతర వేసి డబ్బులు పంపిణీ చేస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అనేక పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేశారని తెలిపారు. ఎన్నికల శిబిరాల పేరుతో జాతర నిర్వహించారని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం డబ్బుల పంపిణీని అడ్డుకోకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని పేర్కొన్నారు. డబ్బులు పంచుతున్నా పోలీసులు పట్టీ పట్టనట్లు వ్యవహరించారని, మధ్యాహ్నం నుంచి అనేక చోట్ల తెలుగుదేశం కార్యకర్తలు దొంగ ఓట్లు వేశారని తెలిపారు. తెలుగుదేశం ఎంఎల్‌ఎ నిబంధనలు ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేశారని పేర్కొన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ చేసిన అక్రమాలపై ఎన్నికల సంఘం స్పందించాలని తెలిపారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు దిడ్ల వీర రాఘవులుకు ఓట్లు వేసిన గ్రాడ్యుయేట్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యానాది కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని జంగంగూడెం యానాది కాలనీలో తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. మండలంలోని జంగంగూడెం యానాది కాలనీ గ్రామంలో ఆయన గురువారం మాట్లాడుతూ తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ క్యాంపులను నూజివీడు మండల పరిధిలోని జంగంగూడెం యానాది కాలనీ గ్రామంలోని ప్రజలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాల్లో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. వివరాల కోసం 9640324266 సెల్‌నెంబర్‌లో వైద్య సేవలు అవసరమైన పేదలు సంప్రదించవచ్చన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ తిరివీధి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


నాగశివప్రసాద్ (ఫైల్)

మండలంలోని రౌతుగూడెం పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఒ.నాగశివప్రసాద్ (49) గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఉపాధ్యాయ సిబ్బంది తెలిపారు. బుట్టాయగూడెం గ్రామానికి చెందిన శివప్రసాద్ గత కొన్నేళ్లుగా రౌతుగూడెం ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. అయితే గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురై గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఆయన మృతికి పలువురు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఆర్‌జియుకెటి నూజివీడులో వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టెక్‌జైట్ 25 కార్యక్రమంలో భాగంగా ఆర్‌జియుకెటి నూజివీడు మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఆటోడెస్క్ ఇన్వెంటరీ వర్క్‌షాప్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.లీలాకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ అఫ్ ఉగ్యాన్ ఎడ్యుటెక్ ప్రయివేట్ లిమిటెడ్, జైరామ్ (ఆర్‌జియుకెటి పూర్వ విద్యార్థి) మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ యు.పావని, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్ అహమ్మద్ బాషా అతిథులుగా హాజరయ్యారు. ఈ వర్క్‌షాపు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించిందని విభాగాదిపతి పావని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ముసునూరు గ్రామానికి చెందిన అనగాని రామకృష్ణను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అతనికి సారా సరఫరా చేస్తున్న నూజివీడు మండలం ఒగిరలతండాకు చెందిన అజ్మీర విజయ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవిఎస్ఎస్.ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి :నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి, చింతలపూడి మండలం తలార్లపల్లి గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అతనిపై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో ధాలాదులి శ్రీనివాస్ వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

227 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు టౌన్ :మండలంలోని మీర్జాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు నూజివీడు ఎస్ఐ లక్ష్మణ్‌బాబు తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 227 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలు స్వాధీనం

భీమడోలు :అంబరుపేట గ్రామ రెవెన్యూ పరిధిలో చేపల చెరువులకు మేతగా తరలిస్తున్న చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలను గురువారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి, రవాణాకు సహకరిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉంగుటూరు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన భలే సత్యనారాయణ మరొక ఇద్దరి సహకారంతో వివిధ ప్రాంతాల్లో సేకరించిన చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా అందించేందుకు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు పోలీసులు దాడులు చేసి వాటిని స్వాధీన పరుచుకున్నారు. పట్టుబడిన చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా చూసేందుకు అంబరుపేట శివారు ప్రాంతంలో ఒక గొయ్యిని తీసి వాటిని రెవెన్యూ, గ్రామపంచాయతీల సహకారంతో ఖననం చేశారు. కేసును భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


సోమయ్యను అరెస్టు చేస్తున్న పోలీసు

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక గురువారం ఏలూరు నగరంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ పది గంటల వరకు మందకొడిగా సాగింది. పది గంటల నుంచి కొంచెం కొంచెంగా పోలింగ్ పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటల తర్వాత వేగం పుంజుకుంది. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఉదయం పది గంటల సమయంలో కలెక్టర్ వెట్రిసెల్వి సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. మధ్యాహ్నం అదే పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా పోలింగ్ జరిగినప్పటికీ రెండు గంటల తర్వాత ఇంచుమించు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారపక్షం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకుని యథేచ్ఛగా పోలింగ్ బూత్ పరిసరాల్లో తిరుగుతూ, ప్రహరీ గేటు దాటి లోపలికి వచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, స్లిప్పులు పంచుతూ కనిపించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు వారు ప్రయాణించిన టికెట్ చూపిస్తే టికెట్ ధరకు సరిపడా డబ్బులు కూడా పంచినట్లు తెలుస్తుంది. అశోక్‌నగర్‌లోని ఎస్‌పిడిపిటి జూనియర్ కాలేజీ, కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధికార పక్ష నాయకులు ఓటర్లకు డబ్బులు పంచినట్లు తెలుస్తుంది. సెయింట్ జేవియర్ పాఠశాల వద్ద వికలాంగుల కోసం వీల్ చైర్ ఏర్పాటు చేయకపోవడంతో వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక పిడిబిటి కళాశాలలో ఉన్న పోలింగ్ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలు దాటినప్పటికీ, గేట్లు వేసినప్పటికీ కూడా నాలుగు గంటల మూడు నిమిషాలకు ఒకరిని, నాలుగు గంటల ఏడు నిమిషాలకు మరో ఇద్దరిని పోలీసులు ఓటు వేసేందుకు లోపలికి పంపించారు.

సోమయ్య అరెస్ట్

స్థానిక గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల వద్ద ఓటర్లకు సహాయం చేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్యను నిబంధనల ఉల్లంఘన నెపంతో పోలీసులు అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరపున ఓటర్లకు సహాయం చేస్తున్న సోమయ్యను టూ టౌన్ పోలీసులు తెలుగుదేశం పార్టీ వారి ఒత్తిడిలకు తలొగ్గి అక్రమంగా అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద నిబంధన అనుసరించి ఓటర్లకు ఫోల్ స్లిప్ అందించే సందర్భంలో తెలుగుదేశం పార్టీ వారు ఫిర్యాదు చేయడంతో ఆయనను అన్యాయంగా టూ టౌన్ పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆయనపై కేసు నమోదు చేసిన పోలీసులు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో 41 నోటీసు ఇచ్చి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ అరెస్టును సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి.ప్రసాద్ తీవ్రంగా ఖండించారు.

భీమడోలు : మండలంలో నమోదైన 1,611 మంది పట్టభద్రుల ఓటర్ల సౌకర్యార్థం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,611 మందికి 1177 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 73.06 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియను భీమడోలు తహాశీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. భీమడోలులోని పోలింగ్ కేంద్రంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల సహాయార్థం కూటమి పక్ష కార్యకర్తలు ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సందర్శించారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 473 మంది ఓటర్లు ఉండగా 329 మంది వరకు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ నవీన్‌కుమార్ భద్రత ఏర్పాట్లు చేశారు. పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మొట్టమొదటి సారి ఎంఎల్‌సి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటింగ్ 70 శాతం నమోదైంది.

ముదినేపల్లి : ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 19, 20 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 1,396 ఓటర్లుండగా వారిలో 1,082 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 675 మంది పురుషులు కాగా, 407 మంది మహిళలు ఉన్నారు. 19వ పోలింగ్ బూత్‌కు 844 ఓట్లు కేటాయించడంతో ఓటర్ల తాకిడి ఎక్కువైంది. దీంతో ఓటు వేసేందుకు ఆలస్యం కావడంతో పలువురు వెనుతిరిగారు. తహాశీల్దార్ సుభాని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎస్ఐ వీరభద్రుడు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో 82.61 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిరువీధుల శారద తన ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి శారద ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామానికి చెందినవారు.


ఓటు హక్కు వినియోగించుకుంటున్న పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

కామవరపుకోట : కామవరపుకోట మండలంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు తహాశీల్దార్ ఎలీషా తెలిపారు. మండలంలో ఉన్న రెండు పోలింగ్ బూత్‌లలో పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 1282 ఓట్లకు 940 ఓట్లు పోలైనట్లు తెలిపారు. 74.7 ఓట్లు నమోదయ్యాయని ఎలీషా తెలిపారు.

వేలేరుపాడు రూరల్ :స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ 250 ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 198 ఓట్లకు 161 నమోదయ్యాయని ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి సిహెచ్ఎల్‌డివి.ప్రసాద్ గుప్తా తెలిపారు. 81.31 శాతం నమోదైంది.

ముసునూరు :మండలంలోని 16 గ్రామాల్లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఓట్లు మొత్తం 1,343 ఉండగా,


దెందులూరులో ఏలూరు ఆర్‌డిఒ పరిశీలన

911 ఓట్లు పోలైనట్లు తహాశీల్దార్ కె.రాజకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11, 12 బూత్‌ల వద్ద పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉదయం ఎనిమిది గంటల నుంచి పోలింగ్ మొదలైంది. కూటమి నాయకులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రం వద్ద గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తూ 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ వంద మీటర్ల దూరం కూడా మరిచి చివరికి దొంగ ఓట్లు వేయటానికి కూడా సిద్ధమయ్యారు. కాని అధికారుల పర్యవేక్షణతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఉంగుటూరు : మండలంలో 1630 ఓటర్లకు 1231 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.52 శాతం నమోదైంది. అధికార పార్టీకి చెందిన నాయకులు ఓటర్లను ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లేలా ప్రలోభాలకు గురిచేశారు. 319 పోలింగ్ కేంద్రంలో ఆఖరి నిమిషంలో తెలుగుదేశానికి చెందిన ఓటరు 3.50 నిమిషానికి వెళ్లగా ఎలాంటి గుర్తింపు కార్డు చూపించకపోవడంతో పిఒ అభ్యంతరం తెలిపారు. దీంతో పోలింగ్ అధికారులతో కూటమి నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

మండవల్లి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండవల్లి మండలంలో 1,112 మంది పట్టభద్రులు ఉండగా 862 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 76.82 శాతంగా నమోదైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు 862 ఓట్లు పోలయ్యాయి. తహాశీల్దార్ గోపాల్, కైకలూరు సిఐ రవికుమార్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్ఐ రామచంద్రరావు పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి సంఘటన నలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ద్వారకాతిరుమల :మండలంలో తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బూత్ నెంబర్ 281, 283 గుండుగొలనుకుంట మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో బూత్ నెంబర్ 283 ఏర్పాటు చేశారు. మొత్తం మూడు పోలింగ్ బూత్‌లలో కలిపి మొత్తం ఓటర్లు 2160 మందికి 1670 ఓట్లు పోలయ్యాయని, 77.6 శాతం ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

టి.నరసాపురం : స్థానిక హైస్కూల్లో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం నాలుగు గంటలకు ముగిశాయి. మండలంలో మొత్తం 918 మంది ఓటర్లు ఉండగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు బూత్‌ల్లో మొత్తం 632 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 68.85 శాతంగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి టిఎస్.సాయిబాబా తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలించారు.

కుక్కునూరు రూరల్ :మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మండలంలో 272 మంది ఓటర్లు ఉండగా మొత్తం 204 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75 శాతం ఓటింగ్ పోలైనట్లు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి కెఎన్‌విఎస్‌పి.లక్ష్మి తెలిపారు.

కలిదిండి : గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 16, 17 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,633 మంది ఓటర్లు ఉండగా మొత్తం 1,359 మంది ఓట్లు వేయగా 83.2 శాతం ఓట్లు పోలయ్యాయని పోలింగ్ అధికారులు తెలిపారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలం మొత్తం మీద 1,650 పట్టభద్రుల ఓట్లు ఉండగా, 1,189 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72గా నమోదైనట్లు తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ తెలిపారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఓటర్లకు వేసవి దృష్ట్యా షామియానా, తాగునీరు వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియను నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజు, నూజివీడు గ్రామీణ సిఐ కె.రామకృష్ణ పరిశీలించారు.

పోలవరం : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహాశీల్దార్ సాయిరాజు తెలిపారు. 254, 255 రెండు బూత్‌లకు కలిపి 1,016 ఓట్లకు 652 ఓట్లు పోలయ్యాయని, 64 శాతం నమోదైందని తెలిపారు. పోలవరం మండలంలో ఎపి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చాట్రాయి : మండలకేంద్రమైన చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 1,553 ఓటర్లు ఉండగా 1065 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేశారు. చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేశారు. 68 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. తహాశీల్దార్ డి.ప్రశాంతి ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు. చాట్రాయిలో ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న తీరును మంత్రి కొలుసు పార్థసారధి పర్యవేక్షించారు. స్థానిక పరిస్థితులను నాయకులను అడిగి తెలుసుకున్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో మొత్తం 3,332 మంది ఓటర్లకు 2,300 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూజివీడు రూరల్ మండల పరిధిలో మొత్తం ఓటర్లు 1,774 మంది ఉండగా 1030 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చింతలపూడి : మండలంలో


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 3,087 ఓటర్లుండగా 2,253 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.96 శాతం నమోదైంది.

దెందులూరు : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ దెందులూరు నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా జరిగింది. కూటమి అభ్యర్థి గెలుపు లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లుగా ఉన్నవారు పోలింగ్ కేంద్రాల వద్దే ఓటర్లకు సమాచారం అందించే వంకతో తమ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రలోభ పెట్టిన సంఘటనలు కనిపించాయి. పెదవేగి మండలంలో 2,891 ఓటర్లు ఉండగా, 2,046 ఓట్లు పోలవ్వగా 70.77 శాతం ఓట్లు నమోదయ్యాయి. పెదపాడు మండలంలో మొత్తం 2,234 మందికి 1,572 మంది ఓట్లు వేయగా 70.37 శాతం ఓట్లు పోలయ్యాయి. ఏలూరు రూరల్ మండలంలో 737 మంది ఓటర్లుండగా, 518 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 70.28 శాతం పోలింగ్ నమోదైనట్లు తహాశీల్దార్ అంతర్వేది శ్రీనివాస్ తెలిపారు. దెందులూరు మండలంలో 2,197 ఓట్లకు, 1,638 ఓట్లు పోలయ్యాయి. 74.56 శాతం పోలింగ్ నమోదైనట్లు తహాశీల్దార్ సుమతి తెలిపారు. కూటమి అభ్యర్థి తరపున దెందులూరు, పెదవేగి వంటి చోట్ల పోలింగ్ కేంద్రాల వద్దే ప్రలోభాలు జరిగినట్లు కనిపించినా పోలీసులు, ఇతర పోలింగ్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. పెదవేగి పోలింగ్ కేంద్రం వద్ద ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఆ కేంద్రం వద్ద ఒక వ్యక్తి అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్న దశలో అక్కడున్న కూటమి అభ్యర్థి తాలూకు వ్యక్తులు అతను ఎవరని ప్రశ్నించారు. ఆయన ఏజెంట్‌నని చెప్పినప్పటికీ అతని వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు. దెందులూరు గారపాటి హైమవతి హైస్కూల్‌లోని రెండు పోలింగ్ బూత్‌లను, ఎంపిపి స్కూల్‌లో ఉన్న ఒక పోలింగ్ బూత్‌ను ఏలూరు ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

బలివేకు 50 వేల మందికి పైగా యాత్రికులు

ప్రజాశక్తి - ముసునూరు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని బుధవారం రాత్రి 11.30 గంటలకు రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడో రోజు గురువారం ఉత్సవాలకు పలు గ్రామాల నుంచి యాత్రికులు సుమారు 50 వేలకు పైగా విచ్చేసి తమ్మిలేరులో స్నానాలు ఆచరించి దైవదర్శనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ సరఫరాలో ఐదు గంటల పాటు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫీర్ అహమ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కెవి, బండివారిగూడెం, రాజుపోతేపల్లి సబ్ స్టేషన్‌లలో వార్షిక మరమ్మతులు, లైన్‌ల పక్కన చెట్లు తొలగించడానికి ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో 11 కెవి ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చింతలపూడి :చింతలపూడి 132/33 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో ఆ సబ్‌స్టేషన్ పరిధి 33 కెవి చింతలపూడి, 33 కెవి టి.నరసాపురం, 33 కెవి లింగపాలెం, 33 కెవి శంఖుచక్రపురం, 33 కెవి రాఘవపురం, 33 కెవి సీతానగరం, 33 కెవి శెట్టివారిగూడెం, 33 కెవి ప్రగతి సోలార్, 33 కెవి పట్టాయిగూడెం ఫీడర్ల పరిధిలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిఆపరు. త్రీ ఫేస్ కరెంట్ దశల వారీగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై ఎపిఇఆర్‌సి తీర్పును వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ :రాష్ట్ర ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నప్పటికీ, పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైనప్పటికీ లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిస్కాంలు ప్రతిపాదించిన విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ఎపిఇఆర్‌సి ఇచ్చిన తీర్పును సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు ఈ తీర్పును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్వాజీ జ్యుడీషియల్ అథారిటీగా ఉంటూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తుగా మారిపోయిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని, బిగింపులను ఎక్కడికక్కడ ప్రజలు తిరస్కరించాలని తెలిపారు. ఇది నూటికి నూరు పాళ్లు కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉద్దేశించిందని, వినియోగదారులపై అదనపు భారం అవుతుందని, ఈ విధంగా బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి గాని, ఎపిఇఆర్‌సికి గాని లేదని పేర్కొన్నారు. ఒక వైపు ఛార్జీలు పెంచడం లేదంటూనే మరొకవైపు ఛార్జీల పెంపుదలకు మూలంగా ఉండే స్మార్ట్ మీటర్లు బిగించడం దొడ్డి దారిన ఛార్జీల భారాన్ని పెంచటమేనని తెలిపారు. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా అదానీ అవినీతి బయటపడటంతో సెకీ ఒప్పందాలను పలు రాష్ట్రాలు, దేశాలు తిరస్కరించి వెనక్కు పంపిస్తున్నా మన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి దానికి ఆమోదముద్ర వేయడమంటే అవినీతికి ఆమోదం తెలపటమేనని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లను బిగించడానికి అనుమతిని ఇవ్వడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.22 కోట్లు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కింపు జరిపారు. హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడిచిన 21 రోజులకు రూ.2,22,23,339 ఆదాయం వచ్చింది. అలాగే యాత్రికుల కానుకల రూపేణ 215 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 085 గ్రాముల వెండి, పాత రూ.500 నోట్లు ఐదు, రూ.వెయ్యి నోట్లు 21, రూ.రెండు వేల నోటు ఒకటి, పలు దేశాల కరెన్సీ లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ఎన్.మూర్తి తెలిపారు.

వీరేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.42.31 లక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమలో ఉన్న భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులు జరిగిన ఉత్సవాల సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయ లెక్కింపును తహాశీల్దార్ సాయిరాజు ఆధ్వర్యంలో డిప్యూటీ తహాశీల్దార్ కంభంపాటి శ్రీనివాసరావు సమక్షంలో గురువారం లెక్కించారు. అంతరాలయం దర్శనం ఆదాయం రూ.10,75,800, శీఘ్ర దర్శన ఆదాయం రూ.5,30,000, స్పెషల్ దర్శన ఆదాయం రూ.3,39,740, కేశఖండన ఆదాయం రూ.720, హుండీల ఆదాయం రూ.14,40,780, లడ్డూ ఆదాయం రూ.2,16,000, పులిహోర ఆదాయం రూ.61,760, కొబ్బరి చెక్కల ఆదాయం రూ.1,33,000, తలనీలాల ఆదాయం రూ.7,100, అన్నదాన విరాళాలు రూ.4,26,978 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌నాయుడు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ జల్లేపల్లి వెంకటరాజు తెలిపారు. మొత్తంగా రూ.42,31,878 ఆదాయం ఉత్సవ నిమిత్తం వచ్చినట్లు తెలిపారు.